

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	36	28

మామిడికుదురు కుర్రోడు రామ్మోహన్‌కి ఏపీఆర్జేసీ ఎంట్రన్స్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు - 7లో

ఎస్ నేనంటే... నేనే



గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

అమలాపురం టౌన్, మే 15: సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు విజేత అంటే.. ఎస్ నేనంటే నేనే అంటున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీల ఏజెంట్లు 14వ తేదీ ఉదయానికి పోలింగ్ బూత్‌ల వారీగా నివేదికలు సిద్ధం చేశారు. ఎవరి లెక్కలు వారివే. కాగితాలపై కూడికలు, తీసివేతలు పూర్తి చేసుకుని గెలుపు నాదంటే నాది అని ఊహల ఊయల్లో ఊగిపోతున్నారు. ఓటర్లు మాత్రం తాను చేయాల్సిన పనిని పూర్తిచేసి గుంభనంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచేది ఓటరే అయినా ఓడిపోయే అభ్యర్థి ఎవరో తెలియక ఆయా పార్టీల నాయకులు నియోజకవర్గాల వారీగా తలలు పట్టుకుంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న పలు కీలక నిర్ణయాలతో గతంలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా 83.84 శాతం పోలింగ్ నమోదై రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పెరిగిన ఓటింగ్ శాతం మా విజయానికే సంకేతమని టీడీపీ, వైసీపీ నాయకులు అంటున్నారు.

లోక్‌సభ ఎన్నిక ఏకపక్షమేనా...

అమలాపురం లోక్‌సభ స్థానానికి ఎన్నిక ఏకపక్షంగా జరిగిందని ప్రధాన పార్టీల నాయకులే చెబుతుండడం విశేషం. లోక్‌సభ స్థానానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగిన క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎవరి మీద పడుతుందోనన్న బెంగ అభ్యర్థులను వెంటాడుతోంది. 30ఏళ్లలోపు యువతీ, యువకులతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందిన సుమారు 3లక్షల మంది యువ ఓటర్లు ఓటేయడానికి క్యూ కట్టడం ఒక ఎత్తయితే.... రాత్రి 10 గంటలైనా మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్లలో నిలబడడం దేనికి సంకేతమన్న ప్రశ్న నాయకుల్లో తలెత్తింది. ఇక రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల నుంచి సైతం ఓటర్లు ఎందుకు వచ్చారో ఓ పార్టీ నాయకులు అసలు ఆలోచించట్లేదు.

మెజార్టీ లెక్కలే...

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు 20వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమాగా చెప్పుండగా... వైసీపీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్ కూడా అదే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ పార్టీ నాయకులు మాత్రం 5 వేల నుంచి 10 వేలు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇప్పటికే మెజార్టీపై పందేలు జోరందుకున్నాయి. అమలాపురం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ప్రధాన పార్టీ ఏజెంట్లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు మెజార్టీపై రూ.కోటి వరకు పందేనికి సిద్ధమన్న ప్రచారం జోరందుకుంది. ఇక పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులైన గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్.... వైసీపీ అభ్యర్థులు విప్పర్తి వేణుగోపాలరావు, గొల్లపల్లి సూర్యారావులతో పోటీపడ్డారు. ఆయా నియోజకవర్గాల్లోనూ ఏకపక్షంగానే పోలింగ్ జరిగినట్టు ఇరు పార్టీల నాయకులు చెప్తున్నారు. సర్వేలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు వాసంశెట్టి సుభాష్, వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల చీలిక కోసం జిమ్మిక్కులు ఫలించేనా...

ప్రధాన పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీ ఎన్నో జిమ్మిక్కులు చేసింది. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన తరఫున గిడ్డి సత్యనారాయణ పోటీ చేయగా అదే పేరుతో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మరో ఇద్దరు గిడ్డి సత్యనారాయణలు బరిలో నిలిచారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ తరఫున అయితాబత్తుల ఆనందరావు పోటీ చేస్తే అదే ఇంటి పేరుతో ఉన్న మరో ఇద్దరిని రంగంలోకి దింపారు. బీఎస్పీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ విజయానికి చేరువయ్యే పరిస్థితి కనిపించట్లేదు. స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దింపడం ద్వారా ఓట్ల చీలిక కోసం చేసిన ప్రయత్నాలు ఎవరికి లబ్ధి చేకూరుస్తాయో వేచి చూడాలి. అయితే ఒకే సామాజికవర్గానికి చెందిన ఓట్లు చీలిపోతే ప్రత్యర్థి అభ్యర్థికి అది కలిసొచ్చే అంశం అన్న చిన్న లాజిక్‌ను ఎలా మిస్సయ్యారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సుభాష్ ప్రభావం ఎంత...

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన వాసంశెట్టి సుభాష్ ప్రభావం ప్రస్తుత ఎన్నికల్లో జిల్లాలో ఎంత మేర ప్రభావం చూపుతుందన్న ప్రశ్న సర్వత్రా నెలకొంది. చాపకింద నీరులా సుభాష్ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సంఘీయుల్లో పెనుమార్పు తీసుకువచ్చారన్న వాదనలో ఎంత మేర నిజం ఉన్నదీ ఈవీఎంలు తెరిస్తేనే గానీ బహిర్గతమయ్యే పరిస్థితి లేదు.



గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీలో కుళాయి వద్ద ఇదీ పరిస్థితి...

దాహం కేకలు

- మూడు ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరు
- రోజూ 28లక్షల లీటర్ల నీటి సరఫరా
- గ్రామాల్లో 52 ఓవర్ హెడ్ ట్యాంకులు
- నిరంతరం నీటి పంపింగ్
- అయినా శివారు గ్రామాలకు అందని తాగునీరు




కూనవరంలోని ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టు

ఉప్పలగుప్తం, మే 15: సమృద్ధిగా నీరున్నా శివారు గ్రామాలకు దాహం బెడద తప్పడం లేదు. మండలంలో మూడు వాటర్ ప్రాజెక్టులున్నా దాహం వెతలు ఏటా సర్వసాధారణమే. మామూలు రోజుల్లోనే తాగునీరందట్లేదంటూ ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఇక వేసవిలో పరిస్థితిని ఊహించుకుంటేనే ఆందోళనగా ఉంటుంది. అధికారులు ఎంత అప్రమత్తంగా వ్యవహరించినా కేవలం కొందరి స్వార్థం కారణంగానే శివారుకు తాగునీరందట్లేదన్నది వాస్తవం. పరిస్థితిని చక్కబెట్టేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు రాజకీయ నాయకుల ప్రభావంతో అడ్డుకట్ట పడుతోంది. ఇప్పుడు పంట కాల్వలను మూసివేయడంతో శివారు గ్రామాల ప్రజలకు మరింత గడ్డు పరిస్థితి ఏర్పడింది. చల్లపల్లి ప్రాజెక్టు ద్వారా 15.10 లక్షలు, కూనవరం ప్రాజెక్టు ద్వారా 8.20 లక్షలు, భీమనపల్లి ప్రాజెక్టు ద్వారా 4.80 లక్షల నీటిని 16 గ్రామాలకు నిత్యం సరఫరా చేస్తున్నారు. ఎస్.యానాంకు ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టు ఉంది. 52 ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ఆయా గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఇంటింటికీ కుళాయి పథకం ఎక్కువ గ్రామాల్లో అమలు చెయ్యడంతో నీటికి కృత్రిమ కొరత ఏర్పడింది. ఇంట్లో కుళాయికి మోటారు అమర్చి ఎక్కువ మొత్తంలో నీటిని తోడేసుకుంటున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉండి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని శివారు గ్రామాలకు ఏడాది పొడవునా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాజకీయ నేతల కారణంగా సమస్య పరిష్కారానికి నోచుకోవట్లేదు. సమస్య పరిష్కారానికి కొన్ని గ్రామాల్లో గ్రామాన్ని రెండు భాగాలుగా విభజించి రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో సామాన్యులకు నీరందట్లేదు. ఎన్నిసార్లు ఇంజన్లు తొలగించినా రెండు రోజుల్లో పరిస్థితి పునరావృతమవుతోందని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం లభించాలంటే స్పెషల్ డ్రైవ్ చేపట్టి, అవసరమైతే చట్టప్రకారం కేసులు నమోదు చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే వేసవిలో తాగునీటి కష్టాలు క్రమంగా పెరుగుతాయని ఆవేదన చెందుతున్నారు.

ప్రజలు సహకరిస్తే సమస్యను పరిష్కరించవచ్చు

సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. గ్రామాలకు మెయిన్ పైప్‌లైను ద్వారా నిత్యం నీటి సరఫరా చేస్తున్నాం. కరెంటు లేని సమయాల్లో జనరేటర్ ఉపయోగిస్తున్నాం. నిత్యం 52 ఓవర్ హెడ్ ట్యాంకులను పూర్తిగా నింపుతున్నాం. ఇక గ్రామాల్లో పంపిణీ విషయంలోనే సమస్యలు ఏర్పడుతున్నాయి. స్థానికంగా ఈ సమస్యలను పరిష్కరించుకోవాలి. నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టాలంటే స్థానికులు పంచాయతీ అధికారులకు సహకరించాలి.



చల్లపల్లిలోని ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ రిజర్వాయర్



పోలమ్మచెరువు గట్టుపై ధ్వంసమైన వాకింగ్ ట్రాక్

లక్షల్లో వ్యయం... ప్రయోజనం శూన్యం

- పుష్కర కాలమైనా పునర్నిర్మాణానికి నోచుకోని వాకింగ్ ట్రాక్
- అనువైన ప్రదేశం లేక వాకర్స్‌కు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి అయ్యింది. శారీరక రుగ్మతల నుంచి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు వాకింగ్ తప్పనిసరి అవుతోంది. పల్లెల్లో అయితే నడక మార్గం అందుబాటులో ఉంటుంది. పట్టణాల్లో ప్రజలు ప్రధాన రోడ్లపై వాకింగ్ చేస్తున్నా వాహనాల రద్దీ ఇతర కారణాల వల్ల పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రణగొణ ధ్వనులు, వాయు కాలుష్యం లేని ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేద్దామనుకునే వారు వాకింగ్ ట్రాక్ లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

ముమ్మిడివరం, మే 15: ముమ్మిడివరం నగర పంచాయతీలో సుమారు 25వేల మంది జనాభా వున్నారు. వారు నడిచేందుకు వీలుగా 2011లో నాటి మంత్రి పినిపే విశ్వరూప్ పోలమ్మచెరువు వాటరు స్టోరేజ్ ట్యాంకు చుట్టూ 1,100 మీటర్ల గట్టును రూ1.70 కోట్లతో వాకింగ్ ట్రాక్ నిర్మింపజేశారు. పట్టణ ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు ఉదయం, సాయంత్రం వాకింగ్ ట్రాక్‌లో వ్యాయామం చేసేవారు. అయితే 2012 ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు ట్యాంకు చుట్టూ ఉన్న గట్టు దిగబడి టైల్స్ ధ్వంసమయ్యాయి. పలుచోట్ల రెండున్నర మీటర్ల లోతుగా గట్టు కుంగిపోయింది. వాకింగ్ ట్రాక్ ధ్వంసం కావడంతో వాకర్స్ బైపాస్ రోడ్డులో నడక సాగిస్తున్నారు. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వాకింగ్ ట్రాక్‌ను కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతస్థాయి అధికారులు పరిశీలించి నాణ్యతా ప్రమాణాల కారణంగానే కుంగిందని నిర్ధారించారు. వాకర్లు పడుతున్న ఇబ్బందులను 2018లో నాటి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించి ట్రాక్ పునరుద్ధరణకు, ఆ ప్రాంతంలో పార్కు నిర్మాణానికి నీరు-చెట్టు పథకం మ్యాచింగ్ గ్రాంటులో రూ.18లక్షలతో అంచనాలు రూపొందించారు. అయితే నిధులు మంజూరు కాక పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు రూ.50లక్షలతో ధ్వంసమైన వాకింగ్ ట్రాక్ టైల్స్‌ను తొలగించి గట్టు దిగబడిన చోట ఎర్ర గ్రావెల్, మట్టితో పూడ్చి గట్టును పటిష్ఠం చేశారు. స్టోరేజ్ ట్యాంకు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అయితే వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ మాత్రం జరలేదు. దీంతో వాకర్స్ ఇబ్బందులుపడుతున్నారు. వృద్ధులు, మహిళలకు ఈ ట్రాక్ ఎంతో అనువుగా ఉండేది. రోడ్డుపై నడవడానికి వారు భయపడుతున్నారు.



వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు



వాకింగ్ ట్రాక్‌కు ఉపయోగించిన సిమెంటు టైల్స్‌ను తొలగించి పక్కన పెట్టిన దృశ్యం

ప్రతి ఒక్కరికీ వ్యాయామం అవసరం

దాట్ల బాబు, రైతు, ముమ్మిడివరం



ప్రస్తుత పరిస్థితుల్లో ఉదయం, సాయంత్రం నడక తప్పనిసరైంది. వ్యాయామం చేసేందుకు పట్టణ ప్రజలకు సరైన ప్రదేశం లేదు. వాకింగ్ చేసేందుకు విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. పోలమ్మ చెరువుగట్టు స్టోరేజ్ ట్యాంకు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలి.

ప్రయోజనం శూన్యం

పాయసం సత్యప్రసాద్, వ్యాపారి



లక్షలు ఖర్చు చేసి వాకింగ్ ట్రాక్ నిర్మించారు. అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. వాకింగ్‌కు వెళదామంటే అనువైన ప్రదేశం లేక ఇబ్బందిపడుతున్నాం. ట్రాక్ ధ్వంసమై పన్నెండేళ్లయినా పట్టించుకోవట్లేదు. వాకింగ్‌కు వెళ్లి సేద తీరేందుకు పోలమ్మచెరువుగట్టు వాకింగ్ ట్రాక్ ఎంతో అనువుగా ఉండేది.

సీనియర్ సిటిజన్లకు ఎంతో అవసరం

వడ్డి నాగేశ్వరరావు, న్యాయవాది, ముమ్మిడివరం



వాకింగ్ ట్రాక్ విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ఎంతో అనువుగా ఉండేది. ఉదయం. సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి సేదతీరేవారు. చెరువు నుంచి వచ్చే చల్లటి గాలితో ఉపశమనం పొందేవాళ్లం. ట్రాక్ ధ్వంసమవ్వడంతో వాకింగ్‌కు అనువైన ప్రదేశం దూరమైంది.

రోడ్డుపై నడవాలంటే భయమేస్తోంది

అవిడి వీర వెంకట సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగి



నడకకు సరైన ప్రదేశం లేక ఇబ్బంది పడుతున్నాం. హైవేపై వెళ్తుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా భయం వేస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ట్రాక్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు

- సీసీ కెమెరాల నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లు
- మూడంచెల భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మే 15: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలతో పాటు ఇతర పోలింగ్ సామగ్రిని కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ బుధవారం తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయగా ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మూడంచెల భద్రతలో భాగంగా మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో స్థాయిలో ఆర్మ్డ్ రిజర్వుడు బలగాలు, మూడో దశలో సివిల్ పోలీసు బలగాలను మోహరింపజేశారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు పరిసరాలను సీసీ టీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రతి స్ట్రాంగ్ రూము వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో గస్తీ నిర్వహిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఫైర్ ఇంజన్లను ముందస్తుగా ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల ప్రధాన గేట్ లోపలికి వెళ్లాలంటే గుర్తింపు కార్డులు తప్పనిసరి అని అనధికార వ్యక్తులకు, ఇతర వాహనాలకు అనుమతి లేదన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఔటర్ పారా మీటర్ వరకు మాత్రమే వెళ్లాలి. రిటర్నింగ్ అధికారులు ఇన్నర్ పారామీటర్ వరకు వెళ్లవచ్చు. స్ట్రాంగ్ రూమ్‌కి ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని... ఆయా గదులకు డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు సాయుధ బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూములను ఉంచడంతో పాటు సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాలు కమాండ్-కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో పారదర్శకంగా జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల సెక్యూరిటీ, కారిడార్‌తో పాటు సీల్డు వేసిన డోర్‌లను కవర్ చేసే విధంగా సీసీ టీవీ కవరేజ్‌తో పాటు వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. సీసీ టీవీ ఫుటేజ్ డేటా నిల్వ ఉండే కెమెరాలను అమర్చామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి నుంచి ఎప్పటికప్పుడు నివేదికను చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తున్నామన్నారు. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి ఎవరైనా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అప్పటి వరకు అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగుతుందని ఎస్పీ శ్రీధర్ చెప్పారు.



చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీధర్

నేటి నుంచి ఏపీఈఏపీసెట్

- మొత్తం 3,61,640 దరఖాస్తులు
- 16 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం
- సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి


కన్వీనర్ వెంకటరెడ్డి

జేఎన్టీయూకే, మే 15: ఏపీలో 47, తెలంగాణలోని 2, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 23 వరకూ నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్‌కు మొత్తం 3,61,640మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇంజనీరింగ్‌కు 2,73,010 మంది, అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 87,419 రెండింటికీ 1211 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 7న విడుదల చేశామని విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టిక్కెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్‌ను ఎంటర్ చేసి హాల్ టికెట్లను పొందవచ్చన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు 16నుంచి 17వరకూ, ఇంజనీరింగ్ పరీక్షలు 18 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని హాల్‌టికెట్లను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ కె.వెంకటరెడ్డి సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య, విద్యుత్, పోలీస్ అధికారులకు, అన్ని జిల్లాల అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2342499, 2359599 నెంబర్లలో కానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 11,509 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో నిర్వహించనున్నామన్నారు. మొత్తం 8రోజులపాటు ఆన్‌లైన్‌లో జరిగే అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలకు 3620మంది విద్యార్థులు, ఇంజనీరింగ్ పరీక్షలకు 7865 మంది, రెండింటికీ 24మంది విద్యార్థులు హాజరుకానున్నారని కన్వీనర్ తెలిపారు. అమలాపురం పరిధిలోని భట్లపాలెంలో ఉన్న బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రాజమహేంద్రవరం పరిధిలోని లూథర్‌గిరిలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లోనూ పరీక్షలను నిర్వహించనున్నామన్నారు.

స్నానానికి దిగి విద్యార్థి మృతి


విద్యార్థి బాలాజీ

కొవ్వూరు, మే 15 : గోదావరి నదిలో స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదీలో మునిగి విదార్థి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజీ(24) ఏఎస్ఆర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని విజ్జేశ్వరం బ్యారేజ్ 36వ గేట్ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. నది లోతును గమనించకుండా గోదావరిలో దిగడంతో ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

ఆత్రేయపురం, మే 15: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తూ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మోదుగుంటకు చెందిన ఆరేపల్లి శ్రీరామ్ (22) బుధవారం సాయంత్రం మిత్ర బృందంతో కలిసి గోదావరి బ్యారేజీని సందర్శించారు. ఆటపాటలతో సందడి చేస్తూ ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం వేళ ర్యాలి ఆర్మ్ అడ్డుకట్ట వద్ద స్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికులు గాలించి అతడిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న శ్రీరామ్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి


రాజారావు

రావులపాలెం, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోటలోని ఓ ప్రైవేటు కంపెనీలో కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన అజ్జరపు రాజారావు (60) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విధులు ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న ఓ హోటల్ సమీపంలో సైకిల్‌పై ఆగి ఉండగా తాడేపల్లిగూడెం నుంచి రంగంపేట వెళ్తున్న పాల ట్యాంకరు వేగంగా వచ్చి బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై రాజారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసి మృతదేహన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

స్వాధార్ హోమ్ తనిఖీ


వివరాలు సేకరిస్తున్న జడ్జి ప్రకాష్‌బాబు

రావులపాలెం, మే 15: రావులపాలెంలోని స్వాధార్ హోమ్ (శక్తి సదన్)ను రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పడక గదులు, వంట గది, డైనింగ్ హాల్ పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో ఉన్న వారు, నిర్వాహకుల సమక్షంలో రికార్డులను పరిశీలించారు. యాజమాన్యం ఎలా చూస్తోంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా సౌకర్యాల కల్పనలో చెప్పాల్సింది ఏదైనా ఉందా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోమ్ నిర్వాహకులతో మాట్లాడుతూ హోమ్‌లో ఉన్న వారికి ఏ రకమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఈ ఏడాది ఆవకాయ ఘాటే





- తగ్గిన పచ్చడి కాయ దిగుబడి
- ఘాటెక్కిన కారం..
- మరుగుతున్న నూనెల ధరలు
- వంద కాయల పచ్చడికి రూ.10 వేలు ఉండాల్సిందే

పెద్దాపురం, మే 15 : పచ్చళ్ల సీజన్‌కు ఎన్నికలు అడ్డుపడ్డాయి. పోలింగ్ ముగియడంతో ఆవకాయ పచ్చడిపై మహిళలు దృష్టి సారించారు. వేసవిలో ఆవకాయ, మాగాయి, వంటి పచ్చళ్లు పెట్టుకోవడం సర్వసాధారణం. కూరలేకపోయినా పర్వాలేదు ఆవకాయ పచ్చడి ఉంటే చాలు అన్నంతో కడుపు నింపేసుకుంటారు. కొంతమందికి ఆవకాయ రుచి తగలనిదే ముద్ద దిగదు. సాధారణంగా మే నెల వచ్చిదంటే చాలు ప్రతీ ఇంట్లో పచ్చడి తయారీ సందడి కనిపిస్తుంది. పది రోజుల ముందు నుంచే తయారీకి అవసరమైన సరుకులు సిద్ధం చేసుకుంటారు. ఇది ఆవకాయ పచ్చడికి ఉన్న డిమాండ్. అయితే ఈఏడాది ఆవకాయ పచ్చడి ఘాటెక్కింది. పచ్చడి పెట్టాలంటే ప్రస్తుత ధర ప్రకారం చేతిలో సుమారు రూ. 10 వేలు ఉండాల్సిందే. అదే 50 కాయలతో అయితే సుమారు రూ. ఐదు వేలు చేతిలో ఉండాల్సిందే. దీనికి కారణం పచ్చడి కాయ దిగుబడి తగ్గిపోవడం, తయారీకి అవసరమైన సరుకుల ధరలు కొండెక్కడమే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పచ్చడి మామిడి కాయ ఎక్కువగా దివాన్‌చెరువు, రాజానగరం, గోకవరం, తుని, ఏజెన్సీ మండలాలనుంచి, అలాగే కొన్ని మెట్ట ప్రాంతాల నుంచి మామిడికాయ వచ్చేది. వాతావరణం అనుకూలించక పోవడంతో ఈ ఏడాది చాలాచోట్ల పూతదశ లోనే రాలిపోయింది. అక్కడక్కడ అరకొరగా కాయలు కనిపిస్తున్నాయి. సాధారణంగా పచ్చడికాయ ధర కాయ సైజును బట్టి ఉంటుంది. సాధారణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తపల్లి కొబ్బరి, దేశవాళీ హైజర్లు, చిన్న, పెద్ద రసాలు, ఆవకాయ పచ్చడికి వాడుతుంటారు.. ఎక్కువకాలం ముక్క మెత్తబడకుండా ఉండేందుకు కాయ కొనుగోలు చేసేటప్పుడు రాజీపడరు. గతంలో ఈరకం కాయలు కొత్తపల్లికొబ్బరి 100 కాయలు రూ.3500 ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో కాయ రూ. 30 నుంచి రూ. 35 వరకూ సైజును బట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక పచ్చడి కారం ప్రధానం. గతంలో ఎన్నడూలేని విధంగా మిరప ధరలు ఘాటెక్కాయి. అలాగే కాయ ముక్కలు చేయడానికి రూ.3, గానుగ నూనె (నువ్వుల నూనె) లీటరు రూ.600, వేరుశెనగ నూనె రూ. 180, పచ్చడి కారం కిలో రూ. 800 క్వాలిటీని బట్టి పలుకుతోంది. ఇవన్నీ కాకుండా బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుతం రూ. 850 పైనే ఉంటోంది. వంద కాయలు పచ్చడి పెట్టాలంటే రూ. 10 వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన నూనె ధరలను చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆవకాయ పెట్టగలమా అనే ఆందోళనలోకి వచ్చారు.

సామగ్రి ధరలు పెరిగాయి



పచ్చడికి అవసరమైన సామగ్రి ధరలు ఇప్పటికే పెరిగిపోయాయి. అలాగే కాయ ధర కూడా పెరిగింది. కనీసం 50 కాయలతో పచ్చడి పెట్టాలంటే రూ. 4 వేల నుంచి ఐదు వేలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఏడాది అంతా పచ్చడి నిల్వ ఉండాలంటే సరుకుల కొనుగోలులో రాజీ పడకూడదు. కాయ దగ్గర నుంచి అన్నీ నాణ్యమైనవే కొనాలి. ఎం.జ్యోతీసీతారత్నం, గృహిణి

రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరం

క్షతగాత్రులను పరామర్శించిన హరీష్‌మాధుర్


క్షతగాత్రులను పరామర్శిస్తున్న హరీష్‌మాధుర్

కొత్తపేట, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరమని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ప్రమాద వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నామన ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు తక్షణం సాయం కింద రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నామన రాంబాబు, తోలేటి సత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మీభాస్కరరావు, గుబ్బల మూర్తి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామన పరామర్శ

అమలాపురం రూరల్, మే 15: పి.గన్నవరం మండలం ఉడిమూడి చింతావారిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్‌ను జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదిమూలం సూర్య, తిరుమనాథం కిరణ్ తదితరులు ఉన్నారు.

కాటన్ జయంతి వేడుకలు


కాటన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

కడియం, మే 15: కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కర రెడ్డి (కందరెడ్డి) ఆధ్వర్యంలో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కందరెడ్డి తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు కాటన్ విగ్రహం వద్ద ప్రతీ ఏటా కాటన్ జయంతి వేడుకలను ఓ ఉత్సవంలా నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం కాటన్ విగ్రహానికి ధాన్యం, క్షీరం, గోదావరి నదీజలాలతో అభిషేకించి పట్టు వస్త్రాలను సమర్పించారు. గ్రామంలో రైతులను ఆహ్వానించి తేనేటి విందు ఇచ్చారు. కందరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ ఇంజనీర్‌గా మన దేశానికి వచ్చిన కాటన్ దొర కాటన్ బ్యారేజీ నిర్మించడంతో రైతుల పాలిట ఆపద్బాంధవునిగా మారారన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో అపర భగీరథునిగా నిలిచిన కాటన్ మహాశయునికి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దూడల నాగేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, కాయల సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అహంకారం అంతం

జూన్ 4న వేడుకలకు సిద్ధంకండి

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు, మే 15: ప్రజాతీర్పుతో వైసీపీ అహంకారం అంతమవుతుందని, జూన్ 4న వేడుకలకు సిద్ధం కావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్‌హాలులో బుధవారం జరిగిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలింగ్‌బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని ప్రకటించిన నాటి నుంచి ఈవీఎంలో ఆఖరి ఓటు పడే వరకూ అలుపెరగకుండా పనిచేసిన, శ్రమించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు ఆయన అభినందనలు తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అందరూ బలంగా నిలబడ్డారని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరూ కులమతాలు గురించి మాట్లాడవద్దని, పవన్‌కల్యాణ్‌కు కులమే లేదని తెలిపారు. జనసైనికులకు ఆవేశం ఉండవచ్చని, అనవసర ఆవేశం వద్దని చెప్పారు. తప్పు ఎక్కడయినా జరిగితే నిలదీయాలని సూచించారు. కార్మికుల కష్టానికి చిహ్నమైన ఎర్ర తువ్వాలు తొలగించాలని పలు చోట్ల వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేశారని విమర్శించారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీతను మర్యాదగా పలకరించాలని, ఆడపడుచుగా గౌరవించాలన్నారు. అంతే తప్ప ఎగతాళి చేయవద్దని తెలిపారు. అది జనసేన సిద్ధాంతం కాదన్నారు. ఆమె ప్రస్తుతం చెడువైపు నిలబడిందని చెప్పారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు బి.మహేందరరెడ్డి, వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ పంచకర్ల సందీప్, తుమ్మలపల్లి రమేష్, అనిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురంలో ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి ఆధ్వర్యంలో యూఎస్ఏ ఎన్ఆర్ఐ జనసైనికులు అందించిన సేవలు అభినందనీయమని నాగబాబు పేర్కొన్నారు. పిఠాపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకూ వారు అందించిన సేవలను ప్రశంసించారు.

మటన్ కూర వండలేదని మనస్తాపం

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 15 : తాను చెప్పినా మటన్ కూర వండలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన ఐశెట్టి వీర్రాజు(38) కార్పెంటర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య కృష్ణవేణిని మటన్ కూర వండమన్నాడు. వండకపోవడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో భార్య, కుమార్తెను తీసుకుని పక్కనే ఉన్న అమ్మగారింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు తెరచి, భర్త చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీర్రాజు తల్లి చక్ర సత్యవతి అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్, మే 15: ఏపీఆర్జేసీ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటారు. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపీసీలో 1వ ర్యాంక్, 2వ ర్యాంక్, బైపీసీలో 2వ ర్యాంక్ తో పాటు టాప్ టెన్‌లో ఎనిమిది ర్యాంక్‌లు సాధించి అత్యుత్తమ ఫలితాలను అందించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను జె.యశ్వంత్ సాయి, స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను ఎమ్.మారుతి సత్యశ్రీకర్, స్టేట్ 5వ ర్యాంక్‌ను పీవీఎస్ సూర్య ధావన్, స్టేట్ 6వ ర్యాంక్‌ను ఎమ్‌కేస్ సాకేత్, స్టేట్ 8వ ర్యాంక్‌ను డి.శ్రీవేద్, స్టేట్ 10వ ర్యాంక్‌ను సీహెచ్ త్రివేణి కైవసం చేసుకున్నారని తెలిపారు. పదిలోపు 8 మంది, 50లోపు 26 మంది, 100లోపు 46 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అమలాపురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మృతి



దేవరపల్లి, మే 15: ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తోకల శ్రీహరి (56) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 6గంటలకు విజయవాడ బయల్దేరగా దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉదయం 11.40 నిమిషాలకు ఎదురుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సూరయ్యపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ తోకల శ్రీహరికి తీవ్ర గాయాలవడంతో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీహరి అన్నయ్య తోకల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

బ్లేడ్ బ్యాచ్ యువకులకు రెండేళ్ల జైలు

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): దారి దోపిడీ కేసులో ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించింది. సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022 అక్టోబరు 11న రాత్రి 9గంటల ప్రాంతంలో ధవళేశ్వరం కంచరలైన్ మెయిన్ రోడ్‌లో 15ఏళ్ల బాలుడు ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌పై బస్టాండ్ వద్దకు వెళ్లాడు. ఆ బాలుడిని ధవళేశ్వరానికి చెందిన అప్పల బత్తుల కృష్ణ వంశీ (దొంగోడు), కూరపాటి సతీశ్ (చేతబడి), ఉమ్మాడి సాయి గణేశ్(సాయి) అడ్డగించారు. బ్లేడు చూపించి భయపెట్టి ప్రభుత్వాస్పత్రి వద్దకు తీసుకెళ్లి ఆటోలో ఎక్కించి చితక్కొట్టారు. దీంతో ఆ బాలుడి శరీరంపై గాయాలయ్యాయి. బలవంతంగా బాలుడి చేతికి ఉన్న వాచీ, రూ.100 లాక్కొని, విషయం బయటకు చెబితే బ్యారేజీ పైనుంచి గోదావరిలో పడేస్తామని బెదిరించారు. బాలుడు ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తాత పట్నాల జువ్వలుకు చెప్పాడు. ఆయన ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్సు న్యాయమూర్తి డి.విజయ్ గౌతమ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి శంభూప్రసాద్, దర్యాప్తు అధికారి అయిన అప్పటి సీఐ కె.మంగాదేవి, విచారణ ప్రక్రియను పర్యవేక్షించిన డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ వి.వినయ్ మోహన్, కోర్టు ఏఎస్ఐ జి.వెంకటేశ్వర్లును ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎనిమిది కాసుల బంగారం చోరీ

చెరకు రసంలో మత్తుమందు కలిపి ఆభరణాలు చోరీ చేసిన మహిళ

అనపర్తి, మే 15 : అనపర్తిలో బుధవారం గుర్తు తెలియని మహిళ ఒక వృద్ధురాలికి మాయ మాటలు చెప్పి చెరుకు రసంలో మత్తుమందు కలిపి ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలతో పరారైంది. ఎస్ఐ రామారావు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదురుగా గల ఇంటిలో సత్యం సత్యవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. భర్త చనిపోవడం ఇద్దరు కుమార్తెలు కుమారుడు దూరంగా ఉండటంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. గత నాలుగు రోజుల నుంచి సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ వృద్ధురాలితో పరిచయం పెంచుకుంది. పనుల్లో సహాయపడుతూ నమ్మకం సంపాదించింది. బుధవారం ఆమె చిన్న కుమార్తె తల్లిని చూసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న మహిళను మీరెవరు అని ప్రశ్నించగా తనకు సత్యవేణి బాగా తెలుసునని నమ్మించింది. కుమార్తె వెళ్లగానే తనతో ప్లాస్టిక్ బాటిల్‌లో తెచ్చిన చెరుకు రసం వృద్ధురాలికి ఇచ్చింది. దీంతో వృద్ధురాలు మత్తులోకి వెళ్లగా బంగారు గొలుసు, ఉంగరాలు తీసుకుని అక్కడి నుండి ఉడాయించింది. స్పృహలోకి వచ్చిన తర్వాత వృద్ధురాలు జరిగిన విషయాన్ని కుమార్తెకు వివరించింది. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పరిసరాల్లోని సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీఆర్జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



మామిడికుదురు, మే 15: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు చెందిన లిఖితపూడి హరిసత్యరామ్మోహన్ ఏపీ ఆర్జేసీ 2024 ప్రవేశ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మంగళవారం రాత్రి ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రకటించారు. ఎంఈసీ విభాగంలో 150 మార్కులకు 140మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడని విద్యార్థి తండ్రి రమేష్ తెలిపారు. రామ్మోహన్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే లక్ష్యమన్నారు. పదో తరగతిలో రామ్మోహన్ 580మార్కులు సాధించాడు.

ధాన్యం లోడు లారీ బోల్తా

కె.గంగవరం, మే 15: కూళ్ల గ్రామంలో బుధవారం ధాన్యం లోడు లారీ తిరగబడింది. కౌలు రైతు జంగం సుబ్బారావు ధాన్యం విక్రయించాడు. లారీలో లోడ్‌చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బాగోకలేకపోవడంతో ప్రక్కన ఉన్న కాలువలోకి బోల్తా పడింది. అప్పటికే లారీలో 240బస్తాలు లోడ్ చేసుకుంది. వీటిలో 100బస్తాలు మరో వాహనంలోకి మార్చారు. 140బస్తాలు నీటిలో తడిసిపోయాయి. రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని స్థానికులు చెబుతున్నారు.

నిలిపివేసిన పథకాల సొమ్ము జమచేయాలి


దీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

అమలాపురం టౌన్, మే 15: సార్వత్రిక ఎన్నికల కారణంగా నిలిపివేసిన పథకాల సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో తక్షణం జమ చేయాలని డిమాండు చేస్తూ సీపీఎం, సీపీఐ నాయకులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం వంటి పథకాల నిధులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. గత ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కినా లబ్ధిదారులకు ఇంతవరకు నగదు జమ కాలేదన్నారు. ఈనెల10,11 తేదీల్లో నగదు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో వేసేందుకు సిద్ధపడగా ఎన్నికల కారణంగా పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి నగదు బదిలీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పోలింగ్ ముగిసినందున వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు కె.సత్తిబాబు, నూకల బలరామ్ కోరారు.

రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి..

ఉడిమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వారు పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి ఆర్టీసీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కాలం చెల్లిన బస్సులను నేటికీ ఆర్టీసీ నడుపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, కె.సత్తిబాబు, బలరాం పాల్గొన్నారు.

పాఠ్య, నోటు పుస్తకాలపై సీఎంవో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీఎంవో సుబ్రహ్మణ్యం

రాజోలు, మే 15: రాజోలు విద్యాశాఖ కార్యాలయంలో పాఠ్య, నోటు పుస్తకాలపై జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ సీఎంవో బి.సుబ్రహ్మణ్యం బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరానికి కావాల్సిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలపై మండల విద్యాశాఖ అధికారులకు, సీఆర్ఎంటీలకు పలు సూచనలు చేశారు. మండలంలో ఉన్న పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేయడానికి శివకోటి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను స్టోరేజ్ పాయింట్‌గా ఎంపిక చేశామని తెలిపారు. శివకోటి హైస్కూలు నుంచి వాహనాల ద్వారా పాఠశాల పాయింట్లకు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సరఫరా చేయాలని, దానికి సంబంధించిన ఇండెంట్‌ను పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయుల నుంచి సేకరించాలని ఎక్కడా కూడా తక్కువ రాకుండా జాగ్రత్తలు వహించాలని సీఎంవో సూచించారని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల..


ఆ నాటి చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం



చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం తీరిది


ఆరోగ్య ఉద్యానవనం కళ కోల్పోయి తుప్పు పట్టి వస్తువులు



తుప్పు పట్టి పాడైపోయిన ఆట వస్తువులు



అమలాపురం టౌన్, మే 15: అందరికీ ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించే చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం అది. నాడు పచ్చదనం పరుచుకుని కళకళలాడితే నేడు పచ్చదనం కొరవడి పట్టించుకునే నాథుడు లేక వెలవెలబోతోంది. అమలాపురం మంచినీటి చెరువుగట్టున ఉన్న చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం నాడు పిల్లా పాపలు, మహిళలు, వృద్ధులు, యువతతో కళకళలాడేది. నేడు అక్కడ ఏది ముట్టుకున్నా అనారోగ్యమే అనే పరిస్థితికి చేరుకుంది. చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన అన్ని రకాల క్రీడా సామగ్రి తుప్పు పట్టి పాడైపోయాయి. బొమ్మలు విరిగిపోయి కొన్ని, రంగులు మారి మరికొన్ని దర్శనమిస్తున్నాయి. విరిగిపోయిన బొమ్మలనే డ్రెయిన్‌లో ఎవరూ జారిపడకుండా రక్షణ కవచాల్లా ఏర్పాటు చేశారు. తుప్పుపట్టిన ఆట వస్తువులు పిల్లల పాలిట ప్రమాదకరంగా మారినట్టు గుర్తించిన మున్సిపల్ అధికారులు ఆరు నెలల క్రితం వాటిని వినియోగించకుండా తాళ్లతో కట్టేశారు. జారుడు బల్లలకు చిల్లులు పడిపోయినా పట్టించుకోలేదు. ఐరన్ మెట్లు, రాడ్లు.. అన్నీ తుప్పు పట్టేశాయి. పిల్లాపాపలతో పాటు యువతను సైతం ఆకట్టుకునే ఆట వస్తువులు నేడు ఎందుకూ పనికి రానివిగా మారిపోయాయి. వాటిని ముట్టుకుని ప్రమాదం కొని తెచ్చుకున్న పిల్లలూ లేకపోలేదు. ప్రస్తుతం ఆరోగ్య ఉద్యానవనానికి వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. కేవలం వాకింగ్ ట్రాక్‌లను మాత్రమే అన్నివర్గాల ప్రజలు వినియోగించుకుంటున్నారు.

ఘనంగా కాటన్ జయంతి

- కాటన్‌కు నివాళులర్పించిన నాయకులు, అధికారులు, రైతు సంఘాల నాయకులు
- కాటన్ సేవలను కొనియాడిన పలువురు


పి.గన్నవరంలో కాటన్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు



కాట్రేనికోనలో కాటన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం, అయినవిల్లి: నల్లచెరువులో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

కాట్రేనికోన: చెయ్యేరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కాటన్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లి సురేష్, ఉపసర్పంచ్ త్సవటపల్లి బీవీ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కాయల విజయబలరామ్, నంద్యాల వెంకటేశ్వరరావు, నంద్యాల బాబి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: అపర భగీరధుడు సర్‌ఆర్థర్ కాటన్ జయంతిని రైతుల ఆధ్వర్యంలో బుధవారం జరుపుకున్నారు. గోపవరం, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో రైతులు కాటన్‌కు నివాళులర్పించారు. కోనసీమ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, నీటి పంపిణీ సంఘం మాజీ చైర్మన్లు అరిగెల నానాజీ, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, రైతు నాయకులు చిక్కం పెద్దబ్బులు, దంగేటి చిట్టిబాబు, గారపాటి రాజారావు, అడ బాల సత్యనారాయణ, నల్లా సత్యనారాయణమూర్తి, బసవా చినబాబు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, మారిశెట్టి పుండరీకాక్షుడు, నడింపల్లి సూర్యనారాయణరాజు, ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, దండు రాంబాబు, గాదిరాజు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. ఇరిగేషన్ కార్యాలయం, కాటన్ బ్యారేజీ వద్ద ఇరిగేషన్ ఉద్యోగులు కాటన్ మహనీయునికి నివాళులర్పించారు.

అల్లవరం: రైతు బాంధవుడు, అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. బెండమూర్లంక, గోడితిప్ప, గోపాయిలంక, అల్లవరం గ్రామాల్లో కాటన్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు, రైతులు పూలమాలలువేసి నివాళులర్పించారు. రైతు నాయకులు యాళ్ల వెంకటానందం, మాకిరెడ్డి సత్తిబాబు, ముత్యాల విజయసారధి, అడపా కృష్ణప్రసాద్, యాళ్ల కాసుబాబు, కొమ్ముల జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ జయంతి వేడుకలను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించి కాటన్ సేవలను కొనియాడారు.

ముమ్మిడివరం: సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం ముమ్మిడివరం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. కాటన్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులను తెచ్చి పంటలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కాటన్ అని ఆయన సేవలను పలువురు కొనియాడారు. కాటన్ జయంతి సందర్భంగా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో రైతులు, ఆయన అభిమానులు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం కాటన్ జయంతి, వర్ధంతి సభలను నిర్వహించి తద్వారా సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు వారు ఈసందర్భంగా పేర్కొన్నారు.

పి.గన్నవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి జడ్పీ సీఈవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.శ్రీరామచంద్రమూర్తి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసల్దారు బి.శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ ఏవో శర్మ, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయినవిల్లి: కాటన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం నల్లచెరువులో కాటన్ విగ్రహానికి సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు గణేశుల రాంబాబు,వింటి శ్రీసాయిరామ్, గుర్రం పెద్దబ్బులు, రావూరి సూరన్న, రావూరి వెంకటరత్నం, రావూరి ప్రభాకరరావు, గుండుమోగుల దొర, అడపా నాగు, రావూరి బాలు, రావూరి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి లాకులు, సఖినేటిపల్లి రేవులో ఉన్న కాటన్ విగ్రహాలకు స్థానిక నాయకులు ఘన నివాళులర్పించారు. సఖినేటిపల్లి మండలం వంటి మారుమూల ప్రాంతాలకు కూడా సాగునీరు అందడానికి ప్రధాన కారణం కాటన్ మహాశయుడని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, విశ్రాంత ఇరిగేషన్ అధికారి సత్యనారాయణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం పరిషత్ కార్యాలయం వద్ద, అల్లవరం మండలం బెండమూర్లంకలో కాటన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యాలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే15: రామచంద్రపురం 33 కేవీ సబ్‌స్టేషన్‌లో పట్టణ ఫీడర్లు అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.విజయానంద్ తెలిపారు. మెయిన్‌రోడ్డు, రత్నంపేట, కమ్మవారిసావరం, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలితానగర్, కవలవారిసావరం, ముచ్చుమిల్లి రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, మద్యకొంపలు, బ్రాడీపేట, గుబ్బలవారిపేట నరసాపురపుపేట చెరువులు, అంకంవారివీధి ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

రావులపాలెం: ఈతకోట ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వెదిరేశ్వరం, కోసూర్‌నగర్, గురువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాలకు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

మలేషియా నుంచి ఓటు వేయడానికి



ఆత్రేయపురం, మే15: మలేషియాలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఉండవల్లి ఫణీంద్రకుమార్ స్వగ్రామం పేరవరం వచ్చి ఓటేశారు. ఐదేళ్లుగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, యువత భవిష్యత్తు నిర్వీర్యమైం దన్నారు. రాష్ట్రం గాడిలో పడాలనే ఉద్దేశ్యంతోనే మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి తాను మలేషియా నుంచి వచ్చి ఓటేసినట్టు చెప్పారు.బంధుమిత్రులంతా ఓటు హక్కు వినియోగించుకునేలాకృషి చేశానన్నారు.

రిక్రియేషన్ క్లబ్‌లపై కొనసాగుతున్న విచారణ

యానాం, మే 15: యానాం నియోజవర్గంలో రిక్రియేషన్ పేరుతో మున్సిపాల్టీ ద్వారా అనుమతులు తీసుకుని పేకాట క్లబ్ నిర్వహించారు. దీనిపై ప్రజలు,ప్రజాప్రతినిధులు, పుదుచ్చేరి ప్రభుత్వం, క్లబ్ నిర్వాహకులు కోర్టుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం యానాం క్లబ్‌లు నిర్వహించడం లేదు. పేకాట క్లబ్‌లకు మున్సిపాల్టీ ఏవిధంగా అనుమతులు ఇచ్చిందనే విషయంపై బుధవారం పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్ కందస్వామి, సత్యనారాయనన్‌ల బృందం యానాం మున్సిపల్ కార్యాలయంలో అధికారులను, బిల్‌కలెక్టర్, ఇతర సిబ్బందిని విచారించింది. క్లబ్‌లకు సంబంధించిన నివేదికలను, ఇచ్చిన అనుమతులను తదితర అంశాలను ఆ బృందం పరిశీలించింది. యానాం పోలీస్ శాఖ చేపట్టి అంశాలను తదితర వాటిపై కూడా విచారణ చేపట్టారు. యానాం పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఫైల్స్‌తో విచారణకు హాజరయ్యారు. గురువారం కూడా విచారణ కొనసాగనుంది. అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది.

ఘనంగా బండారు జన్మదిన వేడుకలు


పాతబస్టాండ్ సెంటర్‌లో కేక్‌కట్ చేస్తున్న బండారు తనయుడు సంజీవ్ తదితరులు



కొత్తపేట, ఏప్రిల్ 15: కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలను టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద బండారు తనయుడు సంజీవ్ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బూసి జయలక్ష్మీభాస్కరరావు, సలాది రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్, గుబ్బల మూర్తి, ముద్రగడ సుబ్బారావు, బీర ఇసాక్, అద్దంకి చంటిబాబు, మిద్దే ఆదినారాయణ, విళ్ల మారుతీప్రసాద్, దేవపాటి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, పెనుమళ్ల అన్నవరం, అన్యం మునేశ్వరరావు, ముద్రగడ ఫణి, ముత్యాల రాజు పాల్గొన్నారు.

రావులపాలెం: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పుట్టిన రోజును పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. రావులపాలెంలోని టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

23న బుద్ధ జయంతి వేడుకలు

అమలాపురం టౌన్, మే 15: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ ఆధ్వర్యంలో ఈనెల23న బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు సెక్రటరీ జనరల్ డీబీ లోక్ తెలిపారు. త్రిరత్న బుద్ధవిహార్‌లో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.అంబేద్కరిస్టులు, బుద్దిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వీవీ దుర్గారావు, కాశి రాంబోధి, ఈవీవీ సత్యనారాయణ, డి.ఆంజనేయులు, పెట్టావెంకట్రావు, ములపర్తి సత్యనారాయణ, బత్తుల నకులరాజు, బంగారాజు, గెడ్డం ప్రదీప్, గోసంగి ఆనందరావు, కాశి వెంకట్రావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న 15,201 మంది

అమలాపురం టౌన్, మే 15: జిల్లాలో 15,201మంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పోలింగ్ విధుల్లో నియమించిన సిబ్బంది, అత్యవసర సేవల్లో నిమగ్నమైన వారి కోసం ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. 85ఏళ్లు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన దివ్యాంగులు సైతం పోస్టల్ బ్యాలెట్ వేశారన్నారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,201మంది, ముమ్మిడివరం 2,026, అమలాపురం 2,513, రాజోలు 2,358, పి.గన్నవరం 2,182, కొత్తపేట 2,117, మండపేట 1,804మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్టు కలెక్టర్ చెప్పారు.

నరసింహకుమార్ మృతి తీరని లోటు

అంతర్వేది, మే 15: మలికిపురం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పోతురాజు వెంకటనరసింహకుమార్(బాబులు) మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా అన్నారు. బుధవారం ఆయన ఇంటి వద్ద బాబులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాబులు గతంలో బీజేపీ నాయకుడిగా పనిచేశారు. అనంతరం వీఆర్వో ఉద్యోగం పొంది సీనియర్ అసిస్టెంట్ స్థాయికి చేరుకున్నరు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి శ్రీనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి పోతురాజు సురేష్, బోనం నాయుడు, పోలిశెట్టి గంగశ్రీగిరిబాబు, యెనుముల సుబ్బారావు, యెనుముల సతీష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: ప్రసన్నవదనం
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ప్రతినిధి-2

రక్తదాన శిబిరం

మామిడికుదురు, మే 15: మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో బ్రైట్ స్టోన్స్ పర్యవేక్షణలో బుద్ధాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ సెంటర్, సహస్ర బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. 45మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరంలో ఉచితంగా హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడి శ్రీను, యక్కల మోహన్, విళ్ల తేజ, మానెం కమలేశ్వరరావు, ఊటుకూరి మాణిక్యనాగబాబు, చెల్లింగి కృష్ణ, గంటు మోహనవిశ్వేశ్వరరావు, కొండా చినబాబి పాల్గొన్నారు.

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలకు గంగవరం విద్యార్థి ఎంపిక

కె.గంగవరం, మే 15: ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలకు అముజూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి పెంకే జితేంద్ర ఎంపికైనట్లు ఎంఈవో ఏ.నాగ రాజు తెలిపారు. ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు చొల్లంగి శ్రీనివాసు లు విద్యార్థిని అభినందించారు.

బర్ల లక్ష్మి కుటుంబానికి సుభాష్ పరామర్శ

ద్రాక్షారామ, మే 15: అంబికపల్లి అగ్రహారంలో సార్వత్రిక ఎన్నికల్లో బర్ల లక్ష్మీ ఓటేసి ఇంటివస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అయితే కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అంబికపల్లి అగ్రహారంలో ఎన్నికల ప్రచారం చేపట్టినప్పుడు తమ వీధిలో డ్రైను నిర్మించాలని బర్ల లక్ష్మీ సుభాష్‌ను కోరింది. వాసంశెట్టి సుభాష్ బుధవారం బర్ల లక్ష్మీ భర్త, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బర్ల లక్ష్మీ కోరిక మేరకు తొలిపనిగా డ్రైను నిర్మాణం చేపడతానని సుభాష్ ప్రకటించారు. సుభాష్ వెంట మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, కోటి ఏడుకొండలు, చిరంజీవి, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్ పాల్గొన్నారు. అలాగే చోడవరంలో ఇటీవల బిక్కిన మోహనరావు సతీమణి బిక్కిన రమాదేవి మృతి చెందారు. బిక్కిన మోహనరావు, కుటుంబీకులను సుభాష్ పరామర్శించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.




హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న ముప్పర్తి కుటుంబీకులు

కూటమిదే విజయం

మలికిపురం, మే 15: ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థులే విజయ దుంధుభి మోగిస్తారని రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో తనను కలిసి అభినందించిన టీడీపీ నాయకులతో ఆయన ముచ్చటించారు. అభివృద్ధే ఏజెండాగా పనిచేస్తానని, తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తానన్నారు. దేవను అభినందించిన వారిలో మందపాటి వెంకటేశ్వరరావు, మన్యం శ్రీను, తాడి నీలకంఠం, నల్లి రాజు, తాడి మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

హరీష్‌మాధుర్‌కు అభినందన

మలికిపురం, మే 15: జిల్లాలో అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను బుధవారం మోరిపోడుకు చెందిన ముప్పర్తి కుటుంబీకులు శాలువాకప్పి సత్కరించారు. అభినందించిన వారిలో సఖినేటిపల్లి టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, బిగ్ ట్రేడర్స్ ముప్పర్తి విక్రమార్కరావు, ముప్పర్తి బాబ్జి, ముప్పర్తి సాయి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ముమ్మిడివరం, మే 15: గాడిలంక జడ్పీ హైస్కూలులో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఒక్కచోట కలిశారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వారు పాఠశాలలో కలుసుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. జేవీఎల్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, పాము ఆనందరావు, పితాని శివకుమార్, కొప్పిశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు

ముమ్మిడివరం, మే15: ముమ్మిడివరం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం ఖాతాదారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ముమ్మిడివరం బ్రాంచి కార్యాలయంలో మెడ్ యునైటెడ్ ఆసుపత్రికి చెందిన వైద్యులు సిబ్బంది, ఖాతాదారులకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశామని మేనేజర్ అచ్చిరాజు తెలిపారు.

సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం, మే 15: అనాతవరం మట్టపర్తివారిపాలెంలో సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. యువతులు కలశాలతో పవిత్ర నదీజలాలను సేకరించి బ్యాండు మేళాలు, డప్పు వాయిద్యాలతో తరలివచ్చి అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో రాయుడు చంద్రశేఖర్, పలివెల శ్రీలక్ష్మి, మర్షిణి, దుగ్గుదుర్తి వెంకటేష్, మట్టపర్తి నాగబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ జన్మదిన వేడుక

అల్లవరం, మే 15: గోడి గ్రామంలో ప్రజాప్రతినిధులు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పుట్టినరోజు జరిగింది. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, దొమ్మేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.46లక్షలు

ఆత్రేయపురం, మే 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,46,958 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

నాగేంద్ర స్వామివారి కల్యాణం

అంబాజీపేట, మే 15: పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న శ్రీనాగేంద్రస్వామి వారి పుట్టకల్యాణ మహోత్సవాన్ని పాణింగపల్లి నాగ వెంకటమురళీ - ప్రకాష్‌శైలజ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా పుట్టవద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు.

వెంకన్న కల్యాణానికి పందిరిరాట ముహూర్తం

అంబాజీపేట, మే 15: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణం సందర్భంగా బుధవారం పందిరిరాట ముహూర్తం చేశారు. ఈనెల17న స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. 18న స్వామివారి కల్యాణం, 19న స్వామివారి తీర్థం, 20, 21, 23న వైశాఖ పూజ, 24 స్వామివారి పుష్పోత్సవం జరుగుతుందన్నారు.

22మంది రక్తదానం

అమలాపురం టౌన్, మే 15: పట్టణంలోని శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న 22మంది విద్యార్థులు బుధవారం ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పి.పూర్ణచంద్రుడు, ఎస్.అనిల్‌కుమార్, బి.పవన్, ఎస్.హేమచంద్ర రక్తదానం చేశారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

పి.గన్నవరం, మే 15: ఉడిమూడి శివారు చింతావారిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తుల మృతదేహాలకు కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. ఈప్రమాద ఘటనపై చిలకలపూడి సూర్యభాస్కరరావు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా సీఐ డి.ప్రశాంత్‌కుమార్‌తో పాటు అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి ఎస్ఐలు చిరంజీవి, సురేష్, రాజేష్ శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా సీఐ ప్రశాంత్‌కుమార్ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

తాటాకిల్లు దగ్ధం

అల్లవరం, మే 15: కోదూరు రైసుమిల్లు సమీపంలో బుధవారం రాత్రి ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. కొడమంచిలి మంగాదేవికి చెందిన ఇంటిలోని సామగ్రి ఈప్రమాదంలో కాలిపోయాయి. ఇంట్లో ఎవరూ సమయంలో ఈప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.

వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి

యానాం, మే 15: యానానికి మూడేళ్లుగా మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ అధికారి లేరని, తక్షణం నియమించాలని యానాం హ్యూమన్ ఫర్ సర్వీస్ ప్రతినిధి గుత్తుల రామారావు కోరారు. మూడేళ్లుగా పూర్తిస్థాయిలో అధికారులను ప్రభుత్వం నియమించకుండా తాత్కాలికంగా నియమించడం, వారు అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరి నుంచి వస్తున్న అధికారి నెలకు మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉండి పుదుచ్చేరి వెళ్లిపోవడంతో యానాంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయితే గత ఆరు నెలలుగా ఆ అధికారి రాకపోవడం వల్ల ఎల్ఆర్ తీసుకున్నవారు, స్లాట్ బుకింగ్, లైసెన్సు రెన్యువల్, కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ జరగకపోవడంతో పోలీసుల నుంచి తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయి వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని ఆయన కోరారు. పెసల వెంకటేష్, కాదా పవన్, లంక బంగారం పాల్గొన్నారు.